# వసుంధర    ఖ్యాతి



నా పేరు మనోహరి. వయసు పందొమ్మిది. ఒక ప్రయివేట్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తున్నాను ఇప్పటి నా అందచందాలు చూసి— చిన్నప్పుడు నాకింకా అందమైన పేరు ఎందుకు పెట్టలేదా అని నా తలిదండ్రులు బాధపడుతూంటారు. నాకా బాధ లేదు. నా అందం పేరుచూసి తెలుసుకోనవసరం లేదు. కానీ— నా పేరు గురించి నాకు బాధ లేకపోయినా— నేను పేరుగలదాన్ని కావాలన్న ఆకాంక్ష నాకున్నది.

దేశమంతా నా పేరు తెలియాలి. ఎవరైనా నన్ను చూడగానే ఫలానా అని గుర్తుపట్టి తమలో తాము గుసగుసలాడుకోవాలి. పత్రికలవాళ్ళు నన్ను ఇంటర్వ్యూ చేస్తూండాలి. నా ఫోటోలు తరచుగా పత్రికల్లో రావాలి.

కొంతమంది నన్ను కథ వ్రాయమన్నారు. అది నాకు వల్లకాని దనిపించింది. అందులో కష్టమేమీ లేదనీ చేతికి వచ్చింది ఏది రాసినా— ఆడవాళ్ళు రాస్తే వేసుకొనే పత్రికలున్నాయనీ స్నేహితు

లన్నారు. అందుకు మాత్రం మొదటుకు పని చెప్పాలి కదా– నాకసలు ఉత్తరాలు రాయడమంటేనే చిరాకు!

కొందరు మోడలింగ్ చేయమన్నారు. ఆ విధంగా సినిమాల్లో అవకాశం కూడా రావచ్చునన్నారు. కానీ రెండూ నాకు ఇష్టంలేదు. నా శరీరంలోని అంగమైన భాగాలను ప్రదర్శించి పేరు తెచ్చుకొనే ఉద్దేశ్యం నాకు లేదు.

ఈ విషయమై నాకు తోచిన ప్రకారం ఒకసారి ప్రసన్నకుమార్‌కి ఉత్తరం వ్రాశాను. ఉత్తరంతోపాటు నా ఫోటో కూడా పంపాను.

ప్రసన్నకుమార్ వయసు ముప్పై అయినా. అతడిప్పుడు తెలుగు చలన చిత్రరంగంలో సూపర్‌స్టార్. ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడు. సామర్థ్యముండి సూపర్‌స్టార్‌గా గలిగిన అతికొద్ది మంచి నటులలో అతడు ఒక్కడు. నేనిప్పుడు అతడితో ఇంటర్వ్యూ కోరాను.

ప్రసన్నకుమార్‌నించి నేననుకున్న విధంగానే జవాబు వచ్చింది. నేనతడిని వెళ్ళి కలుసుకున్నాను. అతడు నా అందానికి అచ్చెరువంది– "మీరు సినిమాల్లోకి వచ్చేయకూడదూ?" అన్నాడు.

"నేను నటినైతే మీవంటివారిని అభిమానించే తీరిక ఉండదు"– అన్నాను.

అతడు చాలా సంతోషించాడు. నేనన్న ఈ విషయం మర్నాడే ఓ సినిమా పత్రికలో వచ్చేసింది. క్రమంగా నాకూ, ప్రసన్నకుమార్‌కీ పరిచయం పెరిగింది.

మేమిద్దరం కలిసి తీయించుకున్న ఫోటోలు పత్రికల్లో వచ్చాయి. అనుకున్న విధంగా నాకు పేరు వచ్చింది. అతడి పిక్చర్ ఏది ప్రారంభమైనా ముహూర్తం షాట్‌కు విధిగా వెళ్ళేదాన్ని. పిక్చర్ అతడిది విడుదల కాకముందే ప్రీవ్యూ చూసేదాన్ని.

"ప్రసన్నకుమార్‌లో మిమ్మల్ని ఆకర్షించిన దేమిటి?" అని ఎందరో నన్నడిగారు. వాళ్ళు పత్రికా విలేఖరులు.

"కోట్లాది ప్రజలు అతడిచేత ఏ విధంగా ఆకర్షించబడినారో నేనూ అలాగే!" అన్నాను.

"మీ రతడిని ప్రేమిస్తున్నారా?"

"అభిమానిస్తున్నాను–"

"అభిమానం అంటే ఎటువంటి అభిమానం?"


"మీరు, మా అన్నయ్య అతడిని ఏ విధంగా అభిమానిస్తున్నారో– నేనూ అలాగే–" అన్నాను.

"అవకాశం వస్తే అతడిని వివాహం చేసుకుంటారా?"

"అతడు వివాహితుడని తెలిసీ మీరీ ప్రశ్న వేయడం నాకు నచ్చలేదు–"

ఒక విలేఖరి నన్ను– "నటుడుగా కాక వ్యక్తిగా ప్రసన్నకుమార్‌పై మీ అభిప్రాయ మేమిటి?" అనడిగాడు.

"సినీనటుల నైతిక జీవనం గురించి




అ నోటా ఈ నోటా చెడుగా విన్నాను. అదంతా అసత్యమని అతడి కారణంగానే నాకు తెలిసింది-" అన్నాను.

ప్రసన్నకుమార్‌కు ఎందరో అభిమానులున్నారు. కానీ నా అందం, నా చొరవ నాకెంతో పేరు తెచ్చిపెట్టాయి.

అయితే నా కెన్నో ఆదర్శాలున్నాయి. నైతిక జీవనంపై కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. సంసార జీవనంలో సామాన్య గృహిణిగా స్థిరపడాలన్న ఆకాంక్ష ఉన్నది. వీటి కారణంగా నా హద్దులు నేను తెలుసుకున్నాను. ప్రసన్నకుమార్‌ను నే నెప్పుడు ఏకాంతంగా కలుసుకోలేదు. పత్రికా విలేఖరులముందో, అతడి భార్య ఉండగానో కలుసుకుని మాట్లాడేదాన్ని. అతడి భార్య నాకు స్నేహితురాలు కూడా అయింది.

ఓ సినీ మాసపత్రిక మా ఇరువురి సంభాషనను వ్యాసంగా ప్రచురించింది.

ఇందులో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి.

ఆడదానికి కాస్త పేరువస్తే అందం లేకపోయినా అపనిందలు వస్తాయి. కాలేజీల్లో కాస్త చలాకీగా తిరిగే ఆడపిల్లకు ఎఫైర్స్ ఉన్నట్లే లెక్కకట్టే సంస్కారం మనది. అలాంటిది ఇంక సినిమాతార్ల సంగతి చెప్పాలా?

ఒక సినిమా పత్రికలో ప్రసన్న కుమార్ భార్యపక్కన నా ఫోటో వేసి- కాబోయే సవతులా? అని వ్రాశారు.

ఇది చదివి నా కొన్ను మండిపడ్డాడు. నా కిచ్చిన స్వాతంత్ర్యాన్ని వృధా చేస్తున్నావన్నాడు. నేను వెంటనే ప్రసన్న కుమార్‌కు ఫోన్ చేశాను. అతడేం చేశాడో

తెలియదుకానీ రెండు రోజుల్లో ఆ పత్రికలో మొదటిపేజీలో నా ఫోటో పడింది.

"ఈమె ప్రసన్నకుమార్ నటనను చూసి అతడి ఫాన్ అయింది. అతడి ప్రతి చిత్రాన్ని చూస్తుంది. అతడిలో లోపాలుంటే విమర్శిస్తుంది. అమలినమైన ఆ అభిమానాన్ని మరో విధంగా చిత్రించడానికి ప్రయత్నించే అసూయాపరుడి కారణంగా మా పత్రికలోనే గతవారం ఒక తప్పుడు వార్త ప్రచురించడం జరిగింది. ఆ అసూయాపరుడు చలనచిత్రరంగానికి చెందిన మరో ప్రముఖ నటుడు. అతడి చరిత్రను త్వరలోనే పాఠకులముందుంచగలమని హామీయిస్తూ-జరిగిన పొరపాటుకు కుమారి మనోహరికి పత్రికాముఖంగా క్షమార్పణ చెప్పుకుంటున్నాము-"

ఈ వార్త చాలామందిని ఆకర్షించింది. ఆ ప్రముఖ నటుడెవరా అన్న ఆలోచన నాలోనూ బయల్దేరింది. ఆఖరికి ప్రసన్నకుమార్‌నే అడిగాను.

అతడు నవ్వి- "ఈ సినీఫీల్డు రాజకీయాలు నీకు తెలియవు. ఆ సంపాదకుడు మనగురించి తప్పుడు వార్త ప్రచురించినాడు. నేను మండిపడ్డాను. కోర్టుకు వెడతానన్నాను. మన గురించి ఏ ఆధారాలు లేవు. అందుకని అతడు భయపడ్డాడు. నన్ను తృప్తిపరచడంకోసం అలా రాశాడు. నిజానికి ఏ ప్రముఖనటుడి ప్రమేయమూ ఇందులో లేదు. పత్రిక సర్క్యులేషన్ కోసం పాట్లు. ఇప్పుడీ కారణంగా చాలామంది అనుమానం చంచల్‌కుమార్ మీదకు పోతుంది. నేనంటే అసూయపడే ప్రముఖనటుడు అతడే। చంచల్‌కుమార్ సంపాదకుడికి ఫోన్ చేస్తాడు. ఆ ప్రముఖనటుడు తను కాదని స్పష్టం చేయమంటాడు. అందుకు డబ్బిస్తాడు. ఇదంతా ఒక వ్యాపారం-" అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నాకు చంచల్‌కుమార్ తెలుసు. అతడు రొమాంటిక్ హీరో. రొమాంటిక్ చిత్రాలకు ఆదరణ తగ్గడంతో అతడు హఠాత్తుగా పడిపోయాడు. లేకపోతే ఒకప్పుడతనికి ప్రసన్నకుమార్‌కి మించిన పేరుండేది. ప్రస్తుతం అతడికంటే కొందరు యువనటుల పనే మెరుగ్గా ఉన్నది.

"కాబోయే సవతులా?" అన్న శీర్షికలో వ్రాయబడిన వ్యాసం సినీపత్రికాలోకంలో గొప్ప సంచలనాన్ని సృష్టించింది. సంపాదకుడిక్షమార్పణఅనంతరం కూడా ఆ శీర్షిక విశేషంగా చర్చించబడింది. ఈ తరహా కళాకారులను ప్రత్యక్షంగా అభినందించాలనుకునే అభిమానాల ఆశలకు అది గొడ్డలిపెట్టు అనీ, పత్రికలటువంటి అపోహాలను ప్రోత్సహిస్తే- కళాకారులకు అభిమానులే కరువైపోతారనీ ఎందరో వ్రాశారు. ఆ శీర్షిక నాకు పేరు తెచ్చిపెట్టింది.



ఈ లోగా నాన్నగారు నాకు సంబంధాలు చూస్తున్నారు. పై చదువులకు అమెరికాలో ఉన్న ఓ యువకుడితో నాకు వివాహం నిశ్చయమయేలా ఉంది. విశేషమేమిటంటే–ఇది కూడా పత్రికల్లో మా ప్రమేయం లేకుండానే వార్తగా వచ్చింది.

ఈ సమయంలోనే ఒక విచిత్రం జరిగింది.

ప్రసన్నకుమార్ చిత్రాలు వరుసగా నాలుగు దారుణమైన దెబ్బతిన్నాయి. అదే సమయంలో చంచల్‌కుమార్ సినిమాలు రెండు రజతోత్సవాలు జరుపుకున్నాయి. ఒకటి శతదినోత్సవంవైపు పరుగులు తీస్తున్నది.

ఒక్కసారి సినీఫీల్డులో వాతావరణం మారిపోయింది.

ప్రసన్నకుమార్ పని అయిపోయిందని కొందరు రాస్తే – సూపర్ స్టార్ చంచల్‌కుమార్ అని కొందరు వ్రాశారు.

ప్రసన్నకుమార్ ఇంటికిపోయి వ్యవసాయం చేసుకోవా లనుకుంటున్నాడని కూడా కొన్ని పత్రికలు ప్రచురించాయి.

నేను నిజంగానే ప్రసన్నకుమార్ అభిమానిని. ఇది నాకు చాలా బాధను కలిగించింది. ఇది చాలా అన్యాయమని పత్రికాముఖంగా ఆక్రోశించాలనుకున్నాను కానీ పత్రికల్లో నా ప్రాముఖ్యత కూడా పడిపోయింది. ఆసమయంలో ఒకరోజున ఒక వ్యక్తి మా ఇంటికి వచ్చాడు.

"నా పేరు నరేష్. నేను చంచల్ కుమార్‌కు కావలసినవాణ్ణి-" అన్నాడతను.

"నమస్కారం. రండి, కూర్చోండి-నాతో మీ కేంపని?" అనడిగాను.

అతడు ఓ చిన్న కవరు నాకు అందించి-"కవరు నేను వెళ్ళేక తెరవచ్చు. కానీ ముందు నా మాట వినాలి-" అన్నాడు.

"చెప్పండి!" అన్నాను.

"మీరు ప్రసన్నకుమార్ ఫాన్ అని నాకు తెలుసు. కానీ ఇప్పుడు ప్రసన్నకుమార్‌కు ఊరూ పేరూ లేదు. ఆ స్థానం చంచల్‌కుమార్ కొట్టేశాడు. ఇప్పుడు చాలామంది హీరోయిన్సు - ప్రసన్నకుమార్‌తో తప్ప నటించం అనే వారంతా చంచల్‌కుమార్‌తోనే నటిస్తామని అంటున్నారు. ప్రసన్నకుమార్‌తో తప్ప చిత్రాలు తీయమనే ప్రొడ్యూసర్లు చాలామంది చంచల్‌కుమార్‌ను బుక్ చేస్తున్నారు ఇలా ఒకరొకరే-ప్రసన్నకుమార్‌నుంచి చంచల్‌కుమార్ వైపుకి తిరిగిపోతున్నారు-" అని ఆగాడు నరేష్.

"చాలా విచిత్రంగా ఉంది-" అన్నాను.

"ఇందులో విచిత్రమేముంది? సినీఫీల్డు తీరే అంత. ఒకప్పుడు చంచల్‌కుమార్ నుంచి ప్రసన్నకుమార్ ఇలాగే అన్నీ లాక్కున్నాడు. ఇప్పుడు గాలివాటం మారింది. మా కిప్పుడు మీ సాయం కావాలి!" అన్నాడు నరేష్.

"నా సాయమా?" అన్నాను ఆశ్చర్యంగా.

"వచ్చే ఆదివారం మీరు చంచల్‌కుమార్ ఇంటికి రావాలి. మీ రిప్పుడు చంచల్‌కుమార్ అభిమానిగా మారినట్లు చెప్పాలి...."

"ఎందుకు?"

"చంచల్‌కుమార్ అప్పుడు పత్రికా విలేఖరులను ఆహ్వానించాడు. ఆ సమావేశంలో మీవంటి వారుంటే అతడి ఇమేజ్ మరింతగా పెరుగుతుంది. అభిమానులుకూడా చంచల్‌వైపు తిరిగిపోతున్నారన్న వార్త సంచలనాన్ని సృష్టిస్తుంది-" అన్నాడు నరేష్.

నేను నివ్వెరపోయాను. మొత్తంమీద నరేష్ నన్ను ఒప్పించి వెళ్ళాడు. నాకు పేరు నిలబడాలన్నా, నా ఫొటోలు పత్రికల్లో కనబడాలన్నా- ఇదే మార్గం అని కూడా అతడు పరోక్షంగా సూచించాడు.

అంటే అతడికి నా మనసు తెలిసిపోయిందనే అనుకోవాలి.

అప్పుడు నేను కవర్ తెరిచాను. అందులో వెయ్యినూటపదహార్లున్నాయి. అది నాకు ఫీజు అన్నమాట!

బాగా ఆలోచించి ప్రసన్నకుమార్‌కు ఫోన్‌చేసి జరిగింది చెప్పాను. అతడు దీనంగా– "ప్లీజ్! మీరు అలా చేయవద్దు. ప్రజలపై ఇది చాలా ప్రభావం చూపుతుంది–" అన్నాడు

"నేను ఎప్పటికీ మీ అభిమానిని! కానీ ఆదివారంనాడు పత్రికావిలేఖరుల సమావేశానికి మాత్రం నేను వెడతాను. మీకేమీ అన్యాయం జరగదు–"

ప్రసన్నకుమార్‌కు నా నిర్ణయం నచ్చలేదు– "మీ ఇష్టం–" అని ఫోన్ పెట్టేశాడు.

ఆపైన జరిగింది పెద్దగా చెప్పవలసిందేం లేదు. నేను ఆదివారం నాడు పత్రికా విలేఖరుల సమావేశానికి వెళ్ళాను. చిన్న చంచల్‌కుమార్ సాదరంగా ఆహ్వానించాడు.

"ప్రసన్నకుమార్ ఇంకా రాలేదా?" అనడిగాను నేను.

"ప్రసన్నకుమార్ ఇక్కడికెందుకు వస్తాడు?" అన్నాడు చంచల్‌కుమార్.

"అతడీ మధ్య పబ్లిక్ సమావేశాలలో కనిపించడం లేదు. ఇంటివద్ద ఎవరికీ ఇంటర్వ్యూ ఇవ్వడంలేదు. ఈ రోజు ఈ సమయంలో మీ ఇంట్లో అతడినీ, మిమ్మల్నీ పత్రికా విలేఖరులు కలిపి ఇంటర్వ్యూ చేస్తారని ఎవరో నాకు చెప్పారు. ఆ మహానటుడిని కలుసుకునే అవకాశం వచ్చింది కదా అని ఇక్కడకు వచ్చాను. అయాంసారీ ఫర్ డిస్టర్బింగ్ ది మీట్!" అని గబగబా బయటకు వెళ్ళిపోయాను.

ఒక ఫాన్‌గా ప్రసన్నకుమార్‌కు నేను చేయగలిగింది అదే.

ఆ రోజు సంఘటన పత్రికాముఖంగా ప్రాచుర్యం పొందింది. ప్రసన్నకుమార్ అందుకు ఎంతో సంతోషించాడంటే– కట్నం కోసం ఆగిపోతుందేమో ననుకున్న [illegible] నాయుడితో పెళ్ళి– [illegible] నాకు!

